# మహిళలను కించపర్చేలా మాట్లాడద్దు

- కేసీఆర్, కేటీఆర్‌పై ఇష్టారీతిన విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, అక్టోబర్ 4: కొండా సురేఖ మహిళా మంత్రి అయి ఉండి తోటి మహిళను కించపర్చేలా మాట్లాడడం ఏమాత్రం సరికాదని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు హితవుపలికారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సినీ నటిని కించపరిచేలా మహిళా మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఇష్టారీతిన విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రుణమాఫీ చేయాలని రైతులు ప్రతిరోజూ ధర్నాలు చేస్తుంటే.. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు అయినప్పటికీ.. హైడ్రా పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టడం తప్పా చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఇలాంటి దుర్మార్గమైన పాలన ఎక్కడ చూడలేదన్నారు. విష జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్న మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చడానికి కాంగ్రెస్ శ్రేణులు పోటీ పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, ఆనంద్‌రావు, వొల్లెం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, శీలం ప్రవీణ్, దామోదర్ రావు, అమీన్, రిజ్వాన్, గంగాధర్, గంగారెడ్డి, నక్క గంగాధర్, గాజుల శ్రీనివాస్, భగవాన్, ప్రతాప్ పాల్గొన్నారు.

# తప్పులతడకగా మెరిట్ జాబితా

- లిస్టులో ఉన్నవారికి కాదని ఇతరులకు ఉద్యోగాలిస్తున్నరు
- 2008 డీఎస్సీ అభ్యర్థులు
- డీఈవో కార్యాలయంలో ఆందోళన



డీఈవో కార్యాలయంలో అధికారులతో గోడు వెల్లబోసుకుంటున్న అభ్యర్థులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 4: 2008 డీఎస్సీ మెరిట్ జాబితా తప్పులతడకగా ఉన్నదని, లిస్టులో ఉన్నవారికి కాదని ఇతరులకు ఉద్యోగాలిస్తున్నారని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. డీఎస్సీ-2008 అభ్యర్థుల్లో ఉద్యోగాలు రానివారికి తిరిగి ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు అందించిన విషయం తెలిసిందే. కాగా, కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారి తీరుతో తాము నష్టపోతున్నామని 13 మంది అభ్యర్థులు శుక్రవారం రాత్రి డీఈవో కార్యాలయంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2008 డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో నష్టపోయిన అభ్యర్థులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగాలివ్వాల్సిన డీఈవో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ డీఈవో వెబ్‌సైట్‌లో మొదట మెరిట్ జాబితాను ఉంచి, ఆ తర్వాత మరో జాబితాను పెట్టి తమకు నష్టం చేశారన్నారు. 16 మంది కొత్త అభ్యర్థులను లిస్ట్‌లో పెట్టడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. అదీ కాకుండా, శుక్రవారం సాయంత్రం మరో 14 మందితో కొత్త లిస్ట్ పెట్టి, తమకు ఉద్దేశ పూర్వకంగానే అన్యాయం చేస్తున్నారని ఆందోళన చేపట్టారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రావు మాట్లాడుతూ, 2008 డీఎస్సీ అభ్యర్థుల్లో మెరిట్ జాబితా ప్రకారం ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. గతంలో మెరిట్ జాబితాలో ఉండి కూడా కొందరు అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు దూరమయ్యారని, అలాంటి అభ్యర్థులను గుర్తించి, ఉద్యోగాలు ఇస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు.

# బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు



వేములవాడ టౌన్, అక్టోబర్ 4: శరన్నవరాత్రుల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు శుక్రవారం బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం, రాజరాజేశ్వరీదేవికి అభ్యంగన స్నానం, మహాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు ప్రదోషపూజ అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మచారిణి అలంకారంలో పూజలు చేశారు. రాత్రి అమ్మవారిని నెమలి వాహనంపై ఊరేగించారు.

# రైతన్న ఆగ్రహ జ్వాల

రైతులను అడ్డుకుంటున్న పోలీసులు



- హామీల అమలు కోసం జగిత్యాలలో పోరుబాట
- కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన
- స్వచ్ఛందంగా తరలివచ్చిన 2వేల మంది కర్షకులు
- ఒకింత ఉద్రిక్త వాతావరణం.. సొమ్మసిల్లిపోయిన ఓ రైతు
- కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ



జగిత్యాల : జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



నినదిస్తున్న రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 4: రైతాంగ హామీ అమలుకోసం జగిత్యాల జిల్లా రైతులు కదం తొక్కారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ చెప్పినట్టుగా షరతులు లేకుండా ₹2 లక్షల రుణమాఫీ చేయాలని, ఎకరానికి ₹15వేల రైతు భరోసా ఇవ్వాలని, అన్నిరకాల వడ్లకు మద్దతు ధరపై క్వింటాల్‌కు ₹500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ నిరసన తెలిపారు. సుమారు 2వేల మందికిపైగా తరలిరాగా, పాత మార్కెట్ బీటు నుంచి పాదయాత్రగా కలెక్టరేట్ సముదాయానికి వచ్చారు. పోలీసులు ముందస్తుగా బారికేడ్లు ఏర్పాటు చేసి అదనపు పోలీసు బలగాలను మోహరించారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతుందన్న నమ్మకంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచి గద్దెనెక్కించారని, కానీ గెలిచిన తర్వాత మోసం చేశారన్నారు. వాగ్దానాలు అమలు చేయడంలో రైతుల్లో గందరగోళం సృష్టించారని, 40 శాతం మందికి మాత్రమే రుణమాఫీ చేసి మిగతా 60 శాతం మందిని గాలికొదిలేశారని మండిపడ్డారు. రుణమాఫీ అమలులో లేనిపోని ఆంక్షలు విధిస్తూ రైతులను రోడ్డుపాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీలో రేషన్‌కార్డు అంటూ ఆంక్షలు విధించడం దారుణమని, బ్యాంకులు ఇచ్చిన రుణాల ఆధారంగా చేసుకొని రుణమాఫీ హామీని వంద శాతం పూర్తి చేయాలన్నారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిందని, వానకాలం సీజన్ పూర్తి కావస్తున్నా రైతు భరోసా నిధులు జమ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు వేముల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ హామీలు ఇచ్చి, గద్దెనెక్కాక చేతులెత్తేసి రైతులను నిండా ముంచిందన్నారు. హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే రాష్ట్రంలోని రైతులందరం కలిసి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనలో రైతు ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కర్నె రాజేందర్, బందెల మల్లన్న, బద్దం మహేందర్ రెడ్డి, గడ్డం రాజరెడ్డి, ఐలేని సాగర్‌రావు, ఏలేటి నర్సింహారెడ్డి, ఉదగిరి ఆదిరెడ్డి, చిలివేరి తిరుపతి, డబ్బా రమేశ్, సురకంటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

## ఉద్రిక్త వాతావరణం

రైతులు దాదాపు 5 గంటల పాటు తమ నిరసన వ్యక్తం చేసినా, కలెక్టర్ సత్యప్రసాద్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకొని బారికేడ్లను తోస్తూ నినాదాలు చేయడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అదే సమయంలో కథలాపూర్ మండలం భూషణరావుపేటకు చెందిన రైతు బద్దం మహేందర్ రెడ్డి సొమ్మసిల్లిపోగా, పోలీసులు దవాఖానకు తరలించారు. నిరసన విషయం తెలుసుకున్న కలెక్టర్ అక్కడికి రాగా, రైతులు తమ డిమాండ్లను విన్నవించుకున్నారు. మీ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు నిరసనను విరమించారు.

## రైతులను మోసం చేస్తున్నరు



కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్ల ముందు రైతు కండువా వేసుకొని ఓట్లు అడిగిన్రు. ఎన్నో మాటలు చెప్పిన్రు. రైతులకు మేలు చేస్తారని అనుకున్నం. కానీ గెలిచిన తర్వాత టెక్నికల్‌గా తప్పించుకుంటున్రు. రైతు రుణమాఫీని కొర్రీలు పెట్టి 40 శాతం మందికి మాత్రమే చేసిన్రు. మిగిలిన 60 శాతం మందికి బ్యాంక్, ఇతరత్రా ప్రాబ్లంలు చెప్పి ఆపేసిన్రు. ప్రభుత్వం రైతులను టెక్నికల్‌గా మోసం చేస్తుంది.

\- అయిల్నేని సాగర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ (మల్యాల)

## రేవంత్ చెప్పినవన్నీ ఉత్తమాటలే



సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ ఉత్తమాటలే. ఎలక్షన్ల ముందు రైతులు బ్యాంకుకు వెళ్లి ₹2 లక్షలు రుణం తెచ్చుకోండి అని చెప్పిండు. అధికారంలోకి రాగానే మాఫీ చేస్తానని అన్నడు. రుణం తెచ్చుకున్నం. ఇప్పటి వరకూ రూపాయి కూడా మాఫీ కాలే. మీది వడ్డీ కట్టమంటే అప్పు తెచ్చి కట్టిన. వానకాలం పంట సాయం కూడా రాలేదు. అన్ని వడ్లకు ₹500 బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తా అంటుండు. సన్నవడ్లు బయట అమ్ముకుంటే ఇంకా ఎక్కువ డబ్బులు వస్తయి. ప్రభుత్వానికి ఎందుకు అమ్ముడు?

\- అత్తినేని రాజన్న, అల్లీపూర్ (రాయికల్ మండలం)

## చేన్లు, చెలకల నుంచి రోడ్లపైకి తెచ్చిన్రు



కాంగ్రెస్ ప్రభుత్వం మస్తు మోసం చేసింది. ఎన్నికల ముందు మా రైతులకు ఎన్నో మాటలు చెప్పి ముంచింది. రుణమాఫీ చేయక, రైతు భరోసా ఇవ్వక చేన్లు, చెలకల్లో పనిచేసుకుంటూ బతికే మమ్ముల రోడ్లపైకి తెచ్చింది. ధర్నాలు, రాస్తారోకోలు చేసేలా చేస్తంది. అన్ని వడ్లకు ₹500 బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకు మాత్రమే ఇస్తా అంటంది. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇయ్యాలె. లేదంటే ఊరుకోం.

\- పిడుగు రాజిరెడ్డి, రైతు (వెంకట్రావుపేట)



# తగ్గిన సాగు.. అందని సాయం

- డీలాపడిన వానకాలం ఎవుసం
- కరీంనగర్ జిల్లాలో గతేడాదికి ఇప్పటికీ 8 వేల ఎకరాల తేడా
- నిరుడు కాళేశ్వర జలాలతో పుష్కలంగా పంటలు
- ఈ సారి నడువని ఎత్తిపోతలు.. అందని రైతు భరోసా
- ఫలితంగా జిల్లాలో తగ్గిన సేద్యం
- మొత్తంగా వరిదే అగ్రస్థానం
- సన్నవడ్లకు మొగ్గు చూపిన అన్నదాతలు
- బోనస్ కోసం ఎదురుచూపులు

**నిరుడితో పోలిస్తే ఈ సారి వానకాలంలో సాగు విస్తీర్ణం తగ్గింది. కరీంనగర్ జిల్లాలో 8 వేల ఎకరాలకుపైగా తేడా వచ్చింది. గత 2023 వానకాలం సీజన్ మొదట్లోనే వర్షాలు అనుకూలించడం, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు కొనసాగించడంతో వ్యవసాయం దండిగా సాగి, రైతన్న పంట పండింది. కానీ, ఈ సీజన్ మొదట్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, కాళేశ్వరం జలాల తరలింపు నిలిపివేయడం, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇవ్వకపోవడంతో గతేడాదికి ఇప్పటికి సాగు తగ్గింది. అయితే ఎప్పటిలాగే ఈ సారి కూడా వరికే అగ్రస్థానం దక్కగా, రైతాంగం రికార్డు స్థాయిలో 1.18లక్షల ఎకరాల్లో సన్న వడ్లు సాగు చేసి బోనస్ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నది.**



కరీంనగర్, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ ముగిసి యాసంగి మొదలైంది. అయితే వానకాలం సాగు విస్తీర్ణాన్ని పరిశీలిస్తే 2023 సీజన్ కంటే ఈ సారి కొంత తగ్గింది. దీనికి ప్రధాన కారణం సీజన్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం వినియోగించకపోవడమేనని స్పష్టంగా తెలుస్తున్నది. ప్రతి సీజన్‌కు ముందు వ్యవసాయ శాఖ అధికారులు సాగు అంచనాలు రూపొందిస్తారు. దానికంటే ముందు సీజన్‌లో సాగైన పంటలను దృష్టిలోకి తీసుకుని తయారుచేస్తారు. ఈ సారి కూడా అన్ని రకాల పంటలు కలిపి 3,45,070 ఎకరాల్లో ఈ వానకాలంలో పంటలు సాగయ్యే అవకాశముంటుందని అంచనా వేశారు. ఏ సీజన్ చూసినా అంచనాకు కాస్త అటీటుగా పంటలు సాగవుతాయి. కానీ, ఈ సారి 10,464 ఎకరాల తేడా వచ్చింది. గత వానకాలం సీజన్‌లో 3,42,919 ఎకరాల్లో పంటలు సాగయితే, ఈ సీజన్‌లో మాత్రం 3,34,606 ఎకరాల్లో మాత్రమే సాగైంది. అంటే 8,313 ఎకరాల్లో పంటలు తగ్గినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. సీజన్ ప్రారంభంలో వర్షాలు అనుకూలించకపోవడం, ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడం వంటి కారణాలతో రైతులు సాగుకు ముందుకు రాకపోవడంతో ఒక్క ఏడాదిలో 8 వేల ఎకరాలకుపైగా సాగు తగ్గింది. జూలై, ఆగస్టు మూడో వారం వరకు వర్షాలు దోబూచులాడాయి. ఎగువన వర్షాలు పడి గోదావరి నుంచి వరద ప్రవాహం ఉన్నప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు రాలేదు. దీంతో జిల్లా పరిధిలోని ప్రాజెక్టులు దాదాపు అడుగంటి కనిపించాయి. పంటల సాగు చివరి దశకు వస్తున్న తరుణంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురియడంలో ప్రాజెక్టుల్లోకి నీళ్లు వచ్చాయి. అయితే అదును దాటడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఫలితంగా పంటల సాగు తగ్గింది. ముఖ్యంగా అపరాల సాగుకు రైతులు మొగ్గు చూపలేదు. వరి, పత్తి పంటలు మాత్రం అధికంగానే సాగు చేశారు.

## వరి సాగుదే అగ్రస్థానం

ఎప్పటిలాగే ఈ సారి కూడా వరిదే అగ్రస్థానంగా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం పంటల విస్తీర్ణం 3,34,606 ఎకరాలు కాగా, 2,75,448 ఎకరాల్లో వరి సాగయింది. 48 వేల ఎకరాల్లో సాగవుతుందనుకున్న పత్తి 43,878 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. కంది 2 వేల ఎకరాల అంచనాలకు కేవలం 811 ఎకరాల్లోనే సాగయింది. 4,500 ఎకరాల్లో మక్కకు అంచనాలు వేయగా, ఇదొక్కటే అందుకు తగినట్టుగా 4,498 ఎకరాల్లో సాగయింది. ఇక మిర్చి, పెసర, మినుములు, ఉలువలు, పసుపు, పొగాకు ఇతర పంటలు 10,782 ఎకరాల్లో సాగయ్యాయి. కాగా, మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి రికార్డు స్థాయిలో సన్నరకం వడ్లను పండించారు. గతంలో 20 నుంచి 30 వేల ఎకరాలు కూడా దాటకపోగా, ఈ సీజన్‌లో 1,18,500 ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తుందనే నమ్మకంతో రైతులు ఇటు వైపు ఎక్కువగా మొగ్గు చూపినట్లు తెలుస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఎమ్మెస్పీ ప్రకటించి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు బోనస్ ఇస్తామన్న విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు.

## ఏదీ రైతు భరోసా

బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 వానకాలంలో రైతుబంధు కింద కరీంనగర్ జిల్లాలోని 2.07 లక్షల మంది రైతులకు ₹182.03 కోట్లు పెట్టుబడి సాయం ఇచ్చింది. పోయిన యాసంగిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధును రైతు భరోసాగా మార్చింది. కానీ ఈ వానకాలంలో మాత్రం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. కానీ, ఎన్నికల ముందు ఎకరానికి ఏడాదికి ₹15 వేలు ఇస్తామని ప్రకటించినట్టు ఇవ్వలేదు. ఈ వానకాలం అయితే పూర్తిగా చేతులెత్తేసింది. దీంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చింది. పోయిన యాసంగిలో చూస్తే 2,03,096 మందికి ₹182.01 కోట్లు మంజూరయ్యాయి. అందులో 1,90,826 మందికి ₹177.61 కోట్లు అందాయి. మిగతా రైతులకు ఇప్పటికీ అందలేదు. పైగా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నంలో ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం యాసంగి సీజన్‌లోనైనా రైతు భరోసాకు శ్రీకారం చుట్టే నమ్మకం కనిపించడం లేదని వాపోతున్నారు.

# బడి ఉన్నా.. బతుకుదువు బిడ్డా

- షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం
- ఊపిరాడక బాలుడి సజీవ దహనం
- కొడుకును తల్చుకుంటూ బోరున విలపించిన తల్లిదండ్రులు
- పండుగ పూట ఈదుల గట్టెపల్లిలో విషాదం



అంగిడి సాయికుమార్ (ఫైల్)

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 4: 'పడుకున్న కొడుకును గిట్లా ఆ దేవుడు తీసుకుపాయె.. నా కండ్ల ముందటే గిట్లాయె భగవంతా.. బడిఉన్నా బతుకుదువు బిడ్డా'.. అంటూ చనిపోయిన కొడుకును తలుచుకుంటూ ఆ తల్లిదండ్రులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన అంగిడి అనిత-రాజు దంపతులకు కూతురు రితిక, కొడుకు సాయికుమార్(7) ఉన్నారు. తల్లిదండ్రులు పరదాలను అద్దెకు ఇస్తుండేవారు. రాజు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. దసరా పండుగ సెలవులు కావడంతో శుక్రవారం సాయంత్రం సమయంలో సాయికుమార్ ఇంట్లోనే నిద్రిస్తుండగా.. తల్లీకూతురు బయట ఉన్నారు. తండ్రి రాజు పనుల నిమిత్తం బయటికి వెళ్లాడు. ఇంతలో షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఆరుబయట ఉన్న తాటికమ్మలు అంటుకుని మంటలు బాగా వ్యాపించాయి. సాయికుమార్ నిద్రలేచే సరికి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. మంటల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఒక డోర్ వైపు పరదలు అంటుకోగా, మరో డోర్ లాక్ అయింది. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నించినా మంటల వ్యాప్తికి ఏం చేయలేకపోయారు. సాయికుమార్ మరో రూమ్‌లోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. అప్పటికే మంటల వ్యాప్తి, పొగతో ఊపిరాడక ఓ మూలన పడిపోయాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటల్లోనే సజీవ దహనం అయిన బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పండుగపూట సాయికుమార్ మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకున్నది. ఘటనా స్థలాన్ని మానకొండూర్ ఇన్‌చార్జి సీఐ స్వామి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# ఆక్రమణలపై టాస్క్‌ఫోర్స్


- పెద్దపల్లి జిల్లాలో రంగంలోకి యంత్రాంగం
- పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాల గుర్తింపు
- ఇటీవలే బంధంపల్లి, ఎల్లమ్మగుండమ్మ చెరువుల్లో ప్రహరీల కూల్చివేత
- రామగుండం నగరంలోని మల్లపురాణి కుంటలో సర్వే.. పలువురికి నోటీసులు



పెద్దపల్లి బంధంపల్లి చెరువు బఫర్‌జోన్‌లో అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పెద్దపల్లి, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో అక్రమ నిర్మాణాల పనిపట్టేందుకు కలెక్టర్ అధ్యక్షతన రెవెన్యూ, నీటిపారుదల, ల్యాండ్ సర్వేయర్, తదితర శాఖలతో టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 9.19ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తాళ్లకుంట, 65 ఎకరాల్లో ఉన్న బంధంపల్లి చెరువు, 5.2 ఎకరాల్లో ఉన్న రంగంపల్లి చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీ ఎల్‌లోని అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు రంగంలోకి దిగి పని మొదలు పెట్టారు. ఆయా చెరువుల పరిధిలో డీజీపీఎస్ (డిజిటల్ గ్లోబల్ పొజిషన్ సర్వే)తో ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించారు. మార్కింగ్ చేసి ఎర్ర జెండాలను కూడా పాతుతున్నారు. అక్రమ నిర్మాణాలుంటే, వివరాలను బల్దియా కమిషనర్లకు తెలియజేస్తూ, తొలగింపునకు సూచనలు చేస్తున్నారు. ఈ మేరకు తాళ్లకుంట చెరువు బఫర్ జోన్‌లో డంప్‌యార్డ్ ఉన్నట్టు నిర్ధారించారు. రంగంపల్లి చెరువు బఫర్ జోన్‌లో ప్రభుత్వ హాస్టల్, ఒక చర్చి, నిర్మాణంలో ఉన్న ఒక భవనం ఉన్నాయని, బంధంపల్లి చెరువు బఫర్ జోన్‌లో 2 రేకుల షెడ్లు, లే అవుట్‌తో ఏర్పాటు చేసిన వెంచర్ ప్రహరీ, శ్మశానవాటిక ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇక రామగుండం నగరంలోని మల్కాపూర్ పరిధిలో మల్లపురాణి కుంటలో కుంటను సర్వే చేశారు. హద్దులను నిర్ధారించారు. 26ఎకరాల ఒక గుంట విస్తీర్ణంలో చెరువు విస్తరించి ఉండగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో దాదాపు 40కి పైగా నిర్మాణాలు ఉన్నట్టు గుర్తించి, పలువురికి నోటీసులు జారీ చేశారు. ఇక పెద్దపల్లి బంధంపల్లి చెరువు బఫర్ జోన్‌లో ఇటీవలే ఓ రియల్టర్ నిర్మించిన ప్రహరీని నేల మట్టం చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని జంట చెరువులైన ఎల్లమ్మ, గుండమ్మ చెరువు శిఖం భూముల్లో అక్రమంగా నిర్మించిన ప్రహరీలను, అక్రమంగా వెలిసిన వెంచర్ల సరిహద్దు రాళ్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు తొలగించారు. ఇదిలా ఉండగా, జిల్లాలో 15 అక్రమ కట్టడాలపై కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్, ఎస్సారెస్పీ తదితర శాఖలకు ఫిర్యాదులు రాగా, అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారని తెలిసింది.

## ఆక్రమణలుంటే ఫిర్యాదులు చేయండి



జిల్లాలో ఎక్కడ చెరువులు, కుంటలు, కాల్వలు కబ్జాకు గురైనా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు జరిగినట్లు గుర్తించినా మా దృష్టికి తేవాలి. సర్వేలు చేసి వాటిపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు కబ్జాలపైనా ఉక్కుపాదం మోపుతాం. ఫిర్యాదులు చేయాల్సిన వారు 'drdopeddapalli@gmail.com కు మెయిల్ చేయాలి. లేదా నేరుగా రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేయవచ్చు.

\- శ్రీనివాస్, ఏడీ, జిల్లా ల్యాండ్ సర్వే అధికారి (పెద్దపల్లి)